క్లుప్తంగా

సంత దుకాణాల వేలం రేపు

నింద్ర: మండల కేంద్రంలో ప్రతి మంగళ వారం నిర్వహించే సంతలో కూరగాయల దుకాణాలకు ఈనెల 31వ తేదీ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ధరణి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఆరోజు ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

అన్నదానానికి దాతలు ముందుకు రావాలి



వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: అన్నదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ఆవణంలో శనివారం గంగాధరనెల్లూరు మండలానికి చెందిన దాత దీపక్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయ అధికారి మాట్లాడుతూ అన్నిదానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని అలాంటి సేవలు అందించే వారికి స్వామివారి అభయం ఎప్పుడూ ఉంటుందన్నారు. టీటీడీ అనుసంధాన ఆలయాల్లో ఒక్కటైన వేణుగోపాల స్వామి ఆలయం ఆవరణంలో ప్రతి శనివారం జరిగే అన్నదాన కార్యక్రమానికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గరుడ విహారీ గోవిందా..



గరుడ వాహనంపై విహరిస్తున్న మువ్వగోపాలుడు

పిచ్చాటూరు: మండల కేంద్రంలో శ్రీధర్మరాజ స్వామి ఆలయ తిరుణాళ్లలో భాగంగా తొమ్మిదవరోజు శనివారం సాయంత్రం శ్రీకృష్ణుడు గరుడ వాహనాన్ని అధిష్టించి పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కళాకారుల పండరి భజనలు, మంగళవాయిద్యాలు, గోవింద భజనల నడుమ ఊరేగింపు నేత్రపర్వంగా జరిగింది. పట్టణ ప్రజలు పిండివంటలు నివేదించి, కర్పూర హారతులతో స్వాగతం పలికారు. గ్రామ సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆదివారం సాయంత్రం అగ్నిగుండం ప్రవేశం, సోమవారం వసంతోత్సవం, సాయంత్రం ధర్మరాజు పట్టాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయని సర్పంచ్ వివరించారు.

చెంగాళమ్మ దేవతకు విశేష పూజలు



పత్యేక అలంకరణలో చెంగాళమ్మ దేవత

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని శ్రీచెంగాళమ్మ అమ్మవారి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో వేసిన అమ్మవారి ముగ్గు ఆకట్టుకుంది. ఉదయం అమ్మవారి మూల మూర్తికి అభిషేక పూజల అనంతరం సుందరంగా అలంకరించారు. నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో గంగమ్మ, మైల ముగ్గ తీర్పు, కలిశ ఉత్సవం, శేష పాన్పు, కలిశ గ్రామోత్సవం, పోతు రాజు ముగ్గులను వేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

నిర్మాణాల్లో రాక్ ఇంజినీరింగ్ పాత్ర కీలకం

ఏర్పేడు: నిర్మాణంలో రాక్ ఇంజినీరింగ్ పాత్ర కీలకమైందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్‌ఐఆర్‌ఎం) శాస్త్రవేత్త డాక్టర్ పీసీ ఝా అన్నారు. శనివారం మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ ఆధ్వర్యంలో నేషనల్ బిల్డింగ్‌లో రాక్ ఇంజినీరింగ్ పాత్ర అనే అంశంపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ పీసీ ఝా మాట్లాడుతూ రాక్ భూభాగం, కొండలకు సంబంధించిన సొరంగాలు, ఆనకట్టలు, పునాదులు, వాలులు ఇతర సివిల్ ఇంజినీరింగ్ రూపకల్పనపై అవగాహన కల్పించారు. భారతదేశంలోని రాక్ ఇంజినీరింగ్ సవాళ్లు, అవకాశాలపై చర్చించారు. శిలా ద్రవ్యరాశి ప్రాథమిక లక్షణ, ఇన్–సిటు టెస్టింగ్, పర్యవేక్షణ, రాక్‌మాస్‌లో భూగర్భ తవ్వకాల సంఖ్యా నమూనాలపై అవగాహన కల్పించారు. అదనంగా ఛీనాబ్ వంతెన రూపకల్పన నిర్మాణ అంశాలు, అమలు సమయంలో సవాళ్లపై చర్చించారు.

సచివాలయాలు.. సత్వర సేవలు

- అవస్థలకు, నిరీక్షణకు తెర
- సమస్యలకు సత్వర పరిష్కారం
- ఇంటి ముంగిటే 540 రకాల సేవలు
- జగనన్న సురక్షలో 7,231 సర్టిఫికెట్ల పంపిణీ
- సేవలపై సర్వత్రా హర్షం



సత్యనారాయణ కాలనీ సచివాలయంలో సేవలందిస్తున్న కార్యదర్శులు

నాడు ఒక సర్టిఫికెట్ పొందాలంటే పలు కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేది. మధ్యవర్తుల ద్వారా కొంత మొత్తం చెల్లించుకొంటేగాని పని అయ్యేది కాదు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయాల వ్యవస్థతో అవస్థలకు, నిరీక్షణకు కాలం చెల్లడంతో పాటు అవినీత రహిత సేవలందుతున్నాయి. సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాల అమలుతో పాటు 11 రకాల సర్టిఫికెట్లను అందజేస్తున్నారు. పుత్తూరు మున్సిపాలిటీలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా 20,935 మంది లబ్ధిదారులకు రూ.199 కోట్లు మంజూరైంది. జగనన్న సురక్ష పథకం కింద 7,231 వివిధ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సేవలపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

పుత్తూరు రూరల్: సచివాలయాల ఏర్పాటుతో ప్రభుత్వం గడప వద్దకే పాలనను తీసుకొచ్చింది. 2000 మంది జనాభా ప్రాతిపదికన గ్రామ, వార్డు సచివాలయాలు అందుబాటులోకి వచ్చాయి. పుత్తూరు మున్సిపాలిటీలో 13 సచివాలయాలు ఏర్పాటు చేశారు. ప్రతి సచివాలయంలో 13 మంది కార్యదర్శులు, 540 సేవలను నిర్దిష్ట కాల వ్యవధిలో అందిస్తున్నారు. ప్రతి వార్డు సచివాలయంలో అడ్మిన్ సెక్రెటరీతో పాటు అమునిటీ, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్, రెవెన్యూ, పోలీస్ ప్రొటెక్షన్, హెల్త్, ఎలక్ట్రిసిటీ సెక్రెటరీలు సేవలందిస్తున్నారు. ఇలా ఏ శాఖ సమస్య అయినా సచివాలయం వద్దకు వెళితే సమస్యను పరిష్కరించుకునే వెసులుబాటు ప్రజల ముంగిటకే వచ్చింది.

జగనన్న సురక్ష పథకంలో పంపిణీ వివరాలు

సచివాలయం	అందించిన సర్టిఫికెట్లు
పల్లూరు	413
రాచపాళెం	382
సత్యనారాయణ కాలనీ	473
దాసరిగుంట	660
గోవిందపాళెం	715
నందిమంగళం	650
ఎన్‌జీఓ కాలనీ	722
అంబేడ్కర్ సర్కిల్	545
లక్ష్మీనగర్ కాలనీ	620
ఆర్టీసీ కాలనీ	728
కళ్యాణపురం	388
ఆరేటమ్మ కాలనీ	505
పిళ్లారిపట్టు	430
మొత్తం	7,231

పుత్తూరు మున్సిపాలిటీ సమాచారం

పథకం పేరు	లబ్ధిదారులు	మంజూరైన మొత్తం (రూ.కోట్లలో!)
వైఎస్ఆర్ పెన్షన్ కానుక	5,776	70.51
చేయూత	2,294	17.21
కాపు నేస్తం	179	1.07
నేతన్న నేస్తం	24	0.23
వైఎస్ఆర్ చేదోడు	213	0.85
వాహన మిత్ర	147	0.59
వైఎస్ఆర్ తోడు	1,288	5.15
అమ్మఒడి	5,274	31.64
జగనన్న విద్యాదీవెన	1,266	7.60
జగనన్న వసతి దీవెన	1,266	7.60
ఈబీసీ నేస్తం	261	1.57
వైఎస్ఆర్ ఆసరా	761	28.48
వైఎస్ఆర్ సున్నా వడ్డీ	999	15.16
జగనన్న పేదలకు ఇళ్లు	406	5.14
జగనన్న హౌసింగ్ లేఅవుట్	781	6.16
మొత్తం	20,935	199.00

జిల్లా కేంద్రాల్లో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తుంటే, ప్రతి సచివాలయంలో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అవినీతికి తావులేకుండా కుల, మత, వర్గ, పార్టీ భేదాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా సచివాలయాలు పనిచేస్తున్నాయి.

జగనన్న మళ్లీ రావాలి



గత ప్రభుత్వంలో క్యాస్ట్ సర్టిఫికెట్ పొందలేక పోయాను. ప్రస్తుతం జగనన్న సురక్ష పథకంలో నా ఇంటి వద్దకే వచ్చి సర్టిఫికెట్ అందించారు. జగనన్న మంచి పథకాల ద్వారా అందరికీ మేలు చేస్తున్నారు. సచివాలయాలు వచ్చాక పనులు త్వరగా అవుతున్నాయి. మళ్లీ జగనన్న ముఖ్యమంత్రిగా కావాలి. మరింత మంచి చేయాలి.

–టి.సుమిత్ర ఈశ్వరాపురం, పుత్తూరు

సచివాలయ వ్యవస్థ ఎప్పటికీ ఉండాలి



జగనన్న సురక్ష పథకం అందరికీ రక్ష. ఎంతో కాలంగా తీసుకోలేకపోయిన సర్టిఫికెట్ ఈ పథకం కింద పొందాను. వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి సర్టిఫికెట్ వచ్చేందుకు సాయపడ్డాడు. వలంటీర్ల వల్ల ఎంతో మంచి జరుగుతోంది. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ఎప్పటికీ ఉండాలి. జగనన్న సీఎం అయ్యాక పేదలకు మేలు జరుగుతోంది.

–ఎస్.హైందవి, రాచపాళెం, పుత్తూరు

ద్రౌపదమ్మ తిరనాళ్ల ప్రారంభం



ధ్వజారోహణం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నగరి: మున్సిపల్ పరిధి చింతలపట్టెడలో ధ్వజారోహణంతో శనివారం ద్రౌపదమ్మ తిరనాళ్లు ప్రారంభమయ్యాయి. తొలిరోజు మహాభారత పారాయణాన్ని డాక్టర్ ఎంపీ నటరాజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 7వ తేదీ వరకు తిరనాళ్లు జరుగుతాయన్నారు. రోజూ ఆలయం వద్ద మహాభారత పారాయణం, భారత ఘట్టాల నాటక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ నెల 31వ తేదీన బకాసుర కుంభం, ఆగస్టు 1న కల్యాణోత్సవం, 2న చర్చావేదిక, 3న ప్రత్యేక దీప పూజ, 4న అర్జున తపస్సు, 5న సప్తమి ఉత్సవం, 6న అగ్నిగుండ ప్రవేశం, 7న వసంతోత్సవం కార్యక్రమాలు ఉంటాయని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

పీహెచ్‌సీ సేవలపై సంతృప్తి

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట పీహెచ్‌సీ సేవలపై జాతీయ నాణ్యతా ప్రమాణాల కమిటీ సభ్యులు డాక్టర్లు శ్రీనాథ్‌రెడ్డి, మురుగేషన్ సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం కమిటీ సభ్యులు పీహెచ్‌సీని పరిశీలించారు. పీహెచ్‌సీలో ఫార్మసి, ఇంజెక్షన్, కా న్పులు, వార్డు, మందుల నిల్వ గదు లు, ఆస్పత్రి, పరిసరాలు, ఉప కేంద్రాల నిర్వహణ, రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణలో సలహాలు ఇచ్చారు. మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య సేవలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై ప్రసన్నుడి వైభవం



ఉభయ దేవేరులతో తిరుచ్చిపై స్వామివారి విహారం

పుత్తూరు రూరల్: అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం, ద్వాదశి సందర్భంగా విశేష సేవలు జరిగాయి. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేతంగా ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలు, పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల ఆలాపనలు, మేళతాళాల నడుమ ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరిలతో కలిసి తిరుచ్చి వాహనంపై తిరువీధుల్లో విహరించారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ వాహన సేవ నయనాదందకరంగా సాగింది. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు రమణాచార్యులు, ఆలయ అధికారి శివకుమార్ పర్యవేక్షించారు.

తొరూరు ఆలయంలో చోరీ

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని తొరూరు గ్రామంలోని గంగమ్మ ఆలయంలో శుక్రవారం హుండీ చోరీ జరిగింది. ఈ చోరీ కేసులో అదే గ్రామానికి చెందిన ఓ బాలుడిని(17) అదుపులోకి తీసుకున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. బాలుడిని తిరుపతి జువెనైల్ కోర్టులో హాజరుపరచగా, జువెనైల్ హోమ్‌కు తరలించాల్సిందిగా జడ్జి ఆదేశించినట్లు సీఐ వెల్లడించారు.

పాదిరేడు స్థలాలను పరిశీలించిన టీటీడీ ఉద్యోగులు



స్థలాలను పరిశీలిస్తున్న టీటీడీ ఉద్యోగులు

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం గ్రామం వద్ద టీటీడీ కేటాయించిన స్థలాలను శనివారం టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పరిశీలించారు. వడమాలపేట సర్వే నంబర్ 42లో స్థలాలను టీటీడీ కేటాయించిందని తెలిపారు. ఇక్కడ ఉన్న 130 ఎకరాల భూమిని పూర్తిగా టీటీడీ ఉద్యోగుల కోసం టీటీడీ తీసుకోవాలని కోరారు. గతంలో ఉద్యోగులకు తిరుపతి నడిబొడ్డున 60 అంకణాల వంతున ఇళ్ల స్థలాలను కేటాయించారని తెలిపారు. ప్రస్తుతం తిరుపతికి 30 కిలో మీటర్ల దూరంలోని వడమాలపేట మండలంలోని స్థలాలను సైతం 60 అంకణాల వంతునే కేటాయించాలని డిమాండ్ చేశారు. సీనియారిటీ ప్రకారం స్థలాలను మంజూరు చేయాలన్నారు. కేటాయించిన స్థలాల వద్ద రోడ్లు, డ్రైనేజీలు, నీటి వసతి వంటి అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్, సభ్యులు శ్రీహరి, రేఖ, సునీల్‌కుమార్, భరత్, మణికంఠ, ధరణికుమార్ పాల్గొన్నారు.

చిదా స్పిన్నింగ్ మిల్లు కార్మికుల ధర్నా



నిరసన తెలుపుతున్న కార్మికులు

పుత్తూరు రూరల్: నిబంధనలకు విరుద్ధంగా మిల్లును మూసివేయడంతో పాటు పరిహారం చెల్లింపులో యాజమాన్యం మొండి వైఖరి అవలంభిస్తోందని ఆరోపిస్తూ పట్టణంలోని చిదా స్పిన్నింగ్ మిల్లు వద్ద శనివారం కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్మికులకు మద్దతుగా పాల్గొన్న సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి మాట్లాడుతూ మిల్లు మూసివేత కారణంగా 171 మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. లే ఆఫ్ ప్రకటించిన యాజమాన్యం అందుకు సంబంధించిన వేతనాలు సైతం చెల్లించకపోవడం దారుణమన్నారు. డీసీఎల్ వద్ద న్యాయం జరగకపోవడంతో కార్మికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారని తెలిపారు. ఈనెల 18న హైకోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు మిల్లును విక్రయించడం గానీ, అందులోని యంత్రాలను తరలించడం గానీ చేయరాదంటూ ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. అయినా హైకోర్టు ఆదేశాలను సైతం లెక్క చేయని యాజమాన్యం మిల్లులోని యంత్రాలను తరలించడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తక్షణం యంత్రాల తరలింపు ఆపకపోతే కోర్టు ధిక్కారణ కేసును సైతం యాజమాన్యం ఎదుర్కోవల్సి వస్తుందని హెచ్చరించారు. ధర్నాలో కార్మిక సంఘ నాయకులు బాబు, రవిచంద్రన్, రామూర్తి, నాగూర్, రాజేంద్రన్, రమేష్, శివలింగం, మాసల తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనపై ప్రజల్లో సంతృప్తి



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శనివారం మున్సిపల్ పరిధి 27వ వార్డులో ఆమె గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల స్థాయి అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందజేశారు. సంక్షేమ పథకాలు, సబ్సిడీ స్కీమ్‌ల ద్వారా అందుతున్న లబ్ధిని వివరించారు. మేలు చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. సంక్షేమ పాలనపై టీడీపీ చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మడం లేదని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎల్లో మీడియా విష ప్రచారం చేస్తోందన్నారు. ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి జగనన్న చరిత్ర సృష్టించారన్నారు. చంద్రబాబు 1995 నుంచి 2004 వరకు ఒక్క ప్రాజెక్టు నిర్మించలేదని, ఇప్పుడు ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. ప్రజలకు మంచి చేసేది ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయేనని, జగనన్న మంచి మనసు, దూరదృష్టి మరెవ్వరికీ లేదని తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, సీడీపీవో కృష్ణవేణి, హౌసింగ్ ఏఈ భాస్కర్, మెప్మా టీఎల్ఎం సునీత, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, చంద్రారెడ్డి, కౌన్సిలర్లు గిరిజాకుమారి, ఇంద్రయ్య, గోపాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, నాయకులు అమర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా మోహర్రం



జీడీ నెల్లూరు అబ్బాస్ కాలనీలో అలంకరించిన పీర్లు



జీడీ నెల్లూరు: రక్త తర్పణ చేస్తున్న ముస్లింలు

గంగాధరనెల్లూరు: త్యాగానికి ప్రతీక అయిన మొహర్రం పండుగను మండల పరిధిలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆవుల కొండ గ్రామంలో ముస్లింలు శనివారం పీర్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించి, రక్తార్పణం చేశారు. మండల కేంద్రంలోని అబ్బాస్ కాలనీలో పీర్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

నింద్ర: మండలంలోని అగరంపేట గ్రామంలో మోహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. పదిరోజులుగా చావడి వద్ద పీర్లను ప్రతిష్టించి రోజు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం రాత్రి పీర్లను ఊరేగించారు. శనివారం ఉదయం అగ్నిగుండం ప్రవేశం చేశారు. పీర్లను ఊరేగించారు.

నేడు ప్రదోష పూజలు

పిచ్చాటూరు: సురుటుపల్లెలోని శ్రీపళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం నందీశ్వరునికి మహా అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బాలాజీ రెడ్డి తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

యాంటీ 'భయో'టిక్స్

- వైద్యుని చీటీ లేకుండానే విచ్చలవిడిగా విక్రయం
- తాజాగా మందుల అమ్మకాలపై నిఘా నేత్రం ఏర్పాటు
- పెనుముప్పు తప్పదంటున్న వైద్యులు



కార్వేటినగరం: ప్రస్తుతం చిన్నా చితక రోగాలకు కూడా యాంటీబయోటిక్స్ వాడడం ఆందోళనకరంగా పరిణమించింది. స్మార్ట్ ఫోన్ వాడకం నేపథ్యంలో సొంత వైద్యంగా ఎవరికి వారు మెడికల్ షాపులకు వెళ్లి వీటిని కొని తెచ్చుకుని వాడేస్తున్నారు. అయితే ఆ మందులు తాత్కాలిక ఉపశమనం కలిగించినా భవిష్యత్‌లో ఎంత ముప్పు కలిగిస్తాయో గమనించడం లేదు. ఈ పరిస్థితులను గుర్తించిన ప్రభుత్వం ఈ విచ్చలవిడి మందుల విక్రయానికి బ్రేక్ వేసేందుకు సంకల్పించింది. వైద్యుని చీటీ ద్వారా మాత్రమే అమ్మకాలనే నిబంధనలను ఇకపై కఠినతరంగా చేస్తోంది. ఈ దిశగా ఔషధ నియంత్రణ శాఖ నడుం బిగించింది.

సీసీ కెమెరాలు తప్పనిసరి

మందుల షాపుల్లో ఏ మందు అడిగినా వెంటనే విక్రయించేస్తున్నారు. యాంటీ బయోటిక్స్ కూడా వైద్యుడి చీటీ ఉంటేనే విక్రయించాలనే నిబంధనను మెడికల్ షాపుల నిర్వాహకులు బేఖాతర్ చేస్తున్నారు. ఇలాంటి వారిపై ఇక నుంచి నిఘా పెట్టేందుకు జిల్లా ఔషధ నియంత్రణ శాఖాధికారులు రంగం సిద్ధం చేశారు. దుకాణ యజమానులు, అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇందు కోసం ప్రతి మెడికల్ షాపు వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని ఆదేశిస్తున్నారు. నిఘా నేత్రం పరిధిలోనే అమ్మకాలు చేయాలని స్పష్టం చేస్తున్నారు. అమ్మిన మందులకు కచ్చితంగా కంప్యూటరైజ్డ్ బిల్లు ఇవ్వాలని ఆదేశిస్తున్నారు. సీసీ కెమెరాలో రికార్డులను కంప్యూటర్‌లో నమోదైన వివరాలను పరిశీలించి తేడా వస్తే చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. అప్పుడప్పుడు జిల్లా ఔషధ నియంత్రణ సహాయ సంచాలకుల ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేపడుతున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు, కంప్యూటర్ బిల్లుల నిర్వహణ వంటి అంశాలను నిశితంగా పరిశీలిస్తున్నారు.

బెంజోడైజపిన్ అమ్మకాలకు బ్రేక్

మత్తు కలిగించే ఆల్‌ప్రోజోలమ్, బెంజోడైన్ వంటి మాత్రలను చాలా మంది నిద్రపట్టక వాడుతుంటారు. ఇవి పక్కదారి పడుతున్నాయి. సారా వ్యాపారులు, బెంజోడైజిసిన్ మందులను అధికంగా కొనుగోలు చేస్తున్నారు. సారా తయారీలో వీటిని వినియోగిస్తున్నారని తెలుస్తోంది. ఈ మందు కలిపిన సారా తాగేవారు మరింత అనారోగ్యం పాలవుతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

యాంటీ బయోటిక్స్ తరచూ వాడితే

- శరీరంలో తీవ్ర ఇన్‌ఫెక్షన్ ఉంటే వైద్యుని సూచన మేరకు యాంటీబయోటిక్స్ వాడాలి
- నిరంతరం వాడితే తర్వాత పెద్ద అనారోగ్యం వస్తే పనిచేయకుండా పోతుంది
- అతిగా వాడితే శరీరంలో బ్యాక్టీరియా నాశనం కాదు
- శరీరంలో కణం మ్యూకస్ పొరలు దెబ్బతింటాయి
- పొట్ట, పేగుల్లో రక్షణ వ్యవస్థగా ఉండే మంచి బ్యాక్టీరియా దెబ్బతింటుంది
- శరీరంలో రక్షణ వ్యవస్థ శక్తివంతంగా పనిచేయ లేదు
- తెల్ల రక్తకణాలు నశించిపోతాయి
- ప్రధానంగా లివర్, కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపుతుంది

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మందుల దుకాణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ప్రతి అమ్మకం కంప్యూటర్‌లో నమోదు కావాలి. వైద్యుల సూచన మేరకు హెచ్ 1 డ్రగ్స్ అమ్మకాలు జరగాలి. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు విక్రయించినట్లు తేలితే ఆ దుకాణానికి అనుమతులను రద్దు చేస్తాం. వైద్యుని చీటీ లేకుండా అమ్మినట్లు తనిఖీల్లో పట్టుబడితే నెల రోజులు దుకాణం మూసివేయిస్తాం.

–డాక్టర్ రవిరాజు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, చిత్తూరు

విదేశీ విధానం అమలు కావాలి



యాంటీ బయోటిక్స్ వాడకం ప్రాణాతంకంగా తయారైంది. వీటి వాడకాన్ని తగ్గించకపోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. విదేశాల్లో యాంటీబయోటిక్స్ విక్రయించాక ఆ చీటీపై ఇక చెల్లదు అనే ముద్ర వేస్తారు. దీంతో ఆ చీటీతో తర్వాత యాంటీబయోటిక్స్ కొనుగోలు చేయలేరు. ఇక్కడ డాక్టర్ రాసిన చీటీ చూపించి ఎన్నిసార్లయినా యాంటీబయోటిక్స్ తెచ్చుకుని వాడుతున్నారు.

– డాక్టర్ లావణ్య, చిన్నపిల్లల వైద్యాధికారిణి

దళితులపై టీడీపీ దాడులు



ధ్వంసం చేసిన శ్మశాన సూచిక బోర్డును తిరిగి ఏర్పాటు చేస్తున్న దళితులు



ధ్వంసమైన శ్మశాన సూచిక బోర్డు

శ్రీరంగరాజపురం: వెదురుకుప్పం మండలం తిప్పినాయుడుపల్లెలో దళిత శ్మశానవాటికను ఆక్రమించిన టీడీపీ నాయకులు దాడులకు తెగబడుతూ అలర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, దళితులకు సర్వే నెం.163/1లో 184 సెంట్ల భూమిని కేటాయించారు. దీనిని అదే గ్రామానికి చెందిన టీడీపీ అగ్రవర్ణ నాయకులు ఆక్రమించుకున్నారు. దాన్ని అడ్డుకున్న దళితులపై దాడి చేశారు. గ్రామ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేయడంతో కోర్టు సానుకూలంగా స్పందించి, ఈ భూమిని దళితులకే కేటాయిస్తూ తీర్పునిచ్చింది. రెవెన్యూ సిబ్బంది ఆ భూమిని చదును చేసి, సర్వే రాళ్లను వేసి, శ్మశాన వాటిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ బోర్డును అదే గ్రామానికి టీడీపీ నాయకులు గురువారం ధ్వంసం చేశారు. అయితే అగ్రవర్ణాల మీదకు రాకుండా గంగాధరనెల్లూరు టీడీపీ నాయకుడు దళితుడైన థామస్, మాజీ ఇన్‌చార్జి చిట్టిబాబు నాయుడు కార్యకర్తలను వెంటపెట్టుకు వెళ్లి కులాలను రెచ్చగొడుతూ దూషించారు. గ్రామ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డిపైనా, దళితులపైనా దాడికి ప్రయత్నించారు. సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి గ్రామస్తులతో కలసి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం సర్పంచ్ విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకుడు థామస్ దళితులకు కేటాయించిన భూమిని ఆక్రమించి, దళితులపైకి దాడికి యత్నించడం నీచమైన చర్యగా వర్ణించారు. అనంతరం ప్రభుత్వ బోర్డును తిరిగి ఏర్పాటు చేశారు.